
ఏటూరునాగారం : పంచాంగ శ్రవణంలో పాల్గొన్న అర్చకులు, గ్రామ పెద్దలు


వెంకటాపూర్: భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరేను సన్మానిస్తున్న అర్చకుడు


భూపాలపల్లి రూరల్: పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భూపాలపల్లి ఎంపీపీ మండల లావణ్యా సాగర్‌రెడ్డి, భక్తులు

# వైభవంగా 'క్రోధి'

## ములుగు, జయశంకర్ జిల్లాల్లో ఘనంగా ఉగాది వేడుకలు


మహదేవపూర్ : పశువులను అలంకరించి వ్యవసాయ పనులను ప్రారంభిస్తున్న రైతులు

- ఆలయాల్లో పూజలు చేసిన భక్తులు
- పంచాంగ శ్రవణం వినిపించిన అర్చకులు
- పచ్చడి ఆరగించి శుభాకాంక్షలు తెలుపుకున్న ప్రజలు


ములుగు రూరల్ : ములుగులోని శ్రీక్షేత్రంలో పంచాంగం చూపించుకుంటున్న గ్రామస్తులు

నమస్తే నెట్‌వర్క్ : తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలు ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మంగళవారం ఘనంగా జరిగాయి. క్రోధి నామ సంవత్సరానికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పంచాంగ శ్రవణాలు వినిపించారు. తీపి, వగరు, చేదుతో తయారు చేసిన ఉగాది పంచడిని ఒకరికొకరు పంచుకున్నారు. విశ్వ బ్రాహ్మణులు వారికి సంబంధించిన పనిముట్లకు ప్రత్యేక పూజలు చేశారు. రైతులు పశువులను ప్రత్యేకంగా అలంరిచి పూజించి వ్యవసాయ పనులను ప్రారంభించారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ఆలయంలో అర్చకులు పంచాంగ శ్రవణం వినిపించారు. కార్యక్రమంలో ఆలయం పర్యవేక్షకుడు బుర్రి శ్రీనివాస్, సీఐ రాజేశ్వర్ రావు, మాజీ ధర్మకర్తలు అడప సమ్మయ్య, శ్యాంమ్ సుందర్ పాల్గొన్నారు. ఏటూరునాగారం మండలం సాయిబాబా ఆలయం, రామాలయంలో జరిగిన కార్యక్రమాల్లో అర్చకులు నాగేశ్వర్‌రావు శర్మ, సుదర్శన్ శర్మ, కమిటీ అధ్యక్షులు మోడెం రమేశ్, పెండ్యాల ప్రభాకర్ పాల్గొన్నారు. మంగపేట మండలం మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి వారికి ఉగాది పర్వదినం సందర్భంగా పల్లకీ సేవ నిర్వహించారు. గుట్ట మీద నుంచి మల్లూరు గ్రామానికి తీసుకొచ్చి ఊరేగింపు జరిపారు. పూజా కార్యక్రమాల్లో ఈవో సత్యనారానారాయణ, ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు, రాజశేఖర్‌శర్మ, పవన్‌కుమార్ ఆచార్యులు, ఈశ్వర్‌చందుశర్మ, సీతారాములు, సుధీర్ పాల్గొన్నారు. రామప్ప దేవాలయంలో భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉగాది సందర్భంగా భక్తులు రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి పూజలు చేసి తీర్థప్రసాదాలతో పాటు ఉగాది పచ్చడి అందజేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని శివాలయం, సాయిబాబ ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూపాలపల్లి మండలం గొర్లవేడు రామాలయంలో ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం సహా పూజాదికాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ మండల లావణ్య సాగర్‌రెడ్డి, భక్తులు హాజరైనారు. టేకుమట్ల మండలంలో మహిళలు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. గౌడ కుస్తులు రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, కుమ్మరి తెచ్చిన కొత్త కుండలో ఉగాది పచ్చడిని కులంతో పాటు భక్తులకు పంపిణీ చేశారు.




మంగపేట : లక్ష్మీనరసింహస్వామి వారిని గుట్టమీద నుంచి పల్లకీలో తీసుకొస్తున్న ఆలయ సిబ్బంది, కాళేశ్వరం : ఆలయంలో పంచాంగం చెప్తున్న అర్చకులు


గణపురం : పంచాంగ శ్రవణం వినిపిస్తున్న శ్రీనివాసచార్యులు

# చిన్న కాళేశ్వరాన్ని ఏడాదిలో పూర్తి చేస్తాం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం, ఏప్రిల్ 9 : కాటారం సబ్ డివిజన్ రైతులకు సాగునీరు అందించే చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును ఏడాదిలో పూర్తి చేస్తామని, ఇప్పటికే పనులు కూడా ప్రారంభమయ్యాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాటారం మండలంలోని స్వగ్రామం ధన్వాడలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమంలో రాజీపడకుండా ప్రజా పాలన సాగిస్తామన్నారు. రాష్ట్రంలో 40 కోట్ల మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పించామమి, 80 శాతం మంది మహిళలు మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. పోలీస్, రెవెన్యూ యంత్రాంగం అత్యంత పారదర్శకంగా పని చేయాలన్నారు. తమ పరిధిలో లేని విషయాల్లో జోక్యం చేసుకొని ఇబ్బందులు సృష్టించవద్దని, న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలె తప్పా, మంత్రులు, మరెవ్వరో చెప్పారని ఇతరులకు ఇబ్బందులు తేవొద్దని ఆదేశాలు జారీ చేశారు. అంతకుముందు ఆయన ఉగాది పర్వదినం సందర్భంగా దత్తాత్రేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ తెలుగు నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు విలాస్ రావు, మండలాధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు తిరుపతిగౌడ్, గద్దె సమ్మిరెడ్డి, కిషన్ నాయక్, రమేశ్‌రెడ్డి, ఊంసింగ్, సత్యం, రాజబాపు, నరేశ్ తదితరులున్నారు.

# కార్యకర్తలను విస్మరిస్తున్న పొదెం

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డీవీ ప్రసాదరాజు


మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డీవీ ప్రసాదరాజు

వాజేడు, ఏప్రిల్ 9 : భద్రాద్రి కొత్తగూడెం డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య కాంగ్రెస్ పార్టీ శ్రేణులను విస్మరిస్తున్నాడని సీనియర్ నాయకుడు దంతూలూరి విశ్వనాథ ప్రసాద రాజు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఆయన నివాసంలో పొందెం వీరయ్యకు వ్యతిరేకంగా కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీవీ ప్రసాదరాజు మాట్లాడుతూ పార్టీ పదేండ్లు అధికారంలో లేకపోయినా తాము కష్టపడి పనిచేశామన్నారు. వాజేడు మండలంలో ముగ్గురు వ్యక్తులను పక్కన పెట్టుకొని పార్టీకి తీవ్ర నష్టం చేస్తున్నారని ఆరోపించారు. వాజేడు మండలం ములుగు జిల్లా పరిధిలో ఉందని, ములుగు జిల్లా అధ్యక్షుడి ఆధ్వర్యంలో మండల అధ్యక్ష పదవికి ఎంపిక చేయాల్సి ఉండగా ఎవరినీ సంప్రదించకుండా డెనార్జునరావును నియమించడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన భద్రాచలం నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ తెచ్చిన ఘనత తమదేనన్నారు. ఏకపక్ష నిర్ణయాలతో పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా స్థానిక నాయకుల అభిప్రాయం తీసుకొని మండల అధ్యక్షుడిని ఎంపిక చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కాకర్లపూడి విక్రాంత్, ప్రసాదరాజు, దాట్ల సీతారామరాజు (వాసు), తల్లడి ఆదినారాయణ, ధనిశెట్టి రాంబాబు, ఎస్కె షబ్బీర్‌పాషా, ఖాజావలీ, దుర్గారావు, నర్సింహాచారి, రానిమేకల రాంబాబు, అంకెనబోయిన నర్సింహారావు, జగన్నాథరాజు, రామ్మూర్తి, ఏసు, బట్ట దామోదర్‌రావు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565


హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

## 'సామూహిక హనుమాన్ చాలీసా' పారాయణం

మహదేవపూర్,ఏప్రిల్ 9 : మండలకేంద్రంలోని రామాలయంలో ఆలయ కమిటీ, దారం రాజబాపు ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తి శ్రద్ధలతో 11 సార్లు చాలీసా పారాయణం చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు, అనంతరం రామోత్సవ కార్యక్రమం నిర్వహించి రామాయణ విశేషాలకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు దేవరావు, భక్తులు వెల్పుల చంద్రమౌళి, బాలయ్య, అంకిరెడ్డి, మోహన్, దారం రమేశ్, సామపుల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్లపై పశువులను వదిలితే చర్యలు


మాట్లాడుతున్న ఎస్సై ప్రసాద్

మహదేవపూర్, ఏప్రిల్ 9: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై పశువులను రోడ్లపై వదిలేస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రసాద్ హెచ్చరించారు. రాత్రి పూట రోడ్లపై పశువులు సంచరిండంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాహనాలు ఢీకొనడంతో మృత్యువాత పడుతున్నాయన్నారు. యజమానులు పశువులను ఇంటి వద్దే ఉంచుకోవాలని సూచించా రు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పశువులను గోశాలకు తరలిస్తామని వెల్లడించారు.

## ఎడ్లబండి బోల్తాపడి మహిళ మృతి


కాట్రేవుల రాజక్క (ఫైల్)

మహదేవపూర్, ఏప్రిల్ 9 : ప్రమాదవశాత్తు ఎండ్ల బండి బోల్తా పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని రాపల్లికోట గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగింది. ఎస్సై ప్రసాద్, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కాట్రేవుల రాజక్క (40) భర్త లచ్చిమల్లుతో కలిసి వంట చెరుకు కోసం సమీప అటవీక్షేత్రానికి వెళ్లగా గ్రామ శివారులో ప్రమాదవశాత్తు ఎండ్ల బండి బోల్తా పడింది. ఈ ఘటనలో రాజక్కకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. లచ్చిమల్లుకు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. మృతురాలి కుమారుడు రాజ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# ఇసుక ర్యాంపుల్లో అదనపు బకెట్ల దందా

డీడీ కంటే అదనంగా లారీల్లో లోడింగ్

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు


అయ్యావారిపేట ఇసుక ర్యాంపులో లారీలో ఇసుకపోస్తున్న పొక్లెయినర్

వాజేడు, ఏప్రిల్ 9 : ఇసుక ర్యాంపుల వద్ద లారీల్లో నిర్వాహకులు అదనపు బకెట్లు లోడింగ్ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. వాజేడు, వెంకటాపురం మండలాల్లోని పలు ఇసుక ర్యాంపుల నుంచి లారీల్లో ప్రభుత్వం నిర్దేశించిన డీడీ కంటే అదనంగా నాలుగు నుంచి ఐదు టన్నుల ఇసుక తరలిస్తున్నారు. ఒక్కో లారీ నుంచి రూ.3వేల నుంచి రూ.5 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలను పోలీసులు ఆపి తనిఖీలు చేసి కేసులు నమోదు చేశారు. మండలంలోని అయ్యావారిపేట ఇసుక ర్యాంపులో యంత్రాల సాయంతో ఇసుక లోడింగ్ చేస్తూ స్థానికులకు పని కల్పించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పంట చేల నుంచి లారీలు వెళ్తుండడంతో దుమ్ము లేచి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తవ్వకాల్లో సైతం నిబంధనలు పాటించకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

### ఇసుక ర్యాంపులో పనికల్పించాలని భీమారం గ్రామస్తుల నిరసన


పనికల్పించాలని ఇసుక లోడింగ్ అడ్డుకొని నిరసన తెలుపుతున్న భీమారం గ్రామస్తులు(ఫైల్)

ధర్మవరం ఇసుక ర్యాంపులో పనికల్పించాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా ఇప్పటి వరకు తమను పట్టించుకోవడంలేదని భీమారం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో లారీలను అడ్డుకోగా పోలీసులు జోక్యం చేసుకొని న్యాయం చేస్తామని చెప్పి లారీలను పంపించారన్నారు. గత శనివారం సైతం ధర్మవరం ఇసుక ర్యాంపు వద్ద ఇసుక లోడింగ్ పనులను నిలుపుదల చేసి నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి అదనపు ఇసుక బకెట్ల దందాను అరిట్టడంతో పాటు, తమకు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని భీమారం గ్రామస్తులు కోరుతున్నారు.

## ఉగాది వేడుకల్లో వాసుదేవారెడ్డి


బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న కేతిరెడ్డి వాసుదేవారెడ్డి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 9 : హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన శ్రీ క్రోధి నామ సంవత్సర వేడుకల్లో బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర దివ్యాంగులు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డి పాల్గొన్నారు. ఉగాది పంచాంగ శ్రవణంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. వేడుకల్లో పాల్గొన్న వారికి తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## వేంకటేశ్వరుడిని దర్శించుకున్న గండ్ర దంపతులు


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 9 : ఉగాది పండుగ సందర్భం గా భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని మాజీ ఎమ్మె ల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి, ఆయన సతీమణి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు శ్రీ తేజస్వరూప్ నిర్వహిస్తున్న పంచాంగ శ్రవణంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండ్ర భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలు, భక్తులకు శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## నగదు సీజ్

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 9: మండలంలోని నూగూరు గ్రామ సమీపంలో ఏఎస్సై రామచందర్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా చర్ల మండలానికి చెందిన సాయి రూ.94,500 తీసుకెళ్తుండగా సీజ్ చేశారు. వాటిని ఎన్నికల అధికారులకు పంపించారు.

## శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు


పూజలు చేసి చలువ పందిళ్లకు ముహూర్తం చేస్తున్న అర్చకులు, భక్తులు

ఏటూరునాగారం, ఏప్రిల్ 9 : మండలకేంద్రం లోని సీ తారామ చంద్ర స్వామి ఆలయంలో ఈనెల 17న నిర్వహించే శ్రీరామ నవమి వేడుకల పనులను ఉగాది పర్వదినాన ప్రారంభించారు. చలువ పంది ళ్లు వేసేందుకు ముహూర్తం ప్రారంభించారు. కల్యాణానికి సం బంధించి లగ్న పత్రికను ఆలయ అర్చకులు నాగేశ్వర్‌రావుశర్మ సిద్ధం చేసి చైర్మన్ మోడెం రమేశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వెంకటాపురం(నూగూరు) ఏప్రిల్ 9 : మండలంలోని వీఆర్‌కే పురం గ్రామానికి చెందిన వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కార్తీక్ (26) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన గ్రామస్తులు వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట, ఏప్రిల్ 9 : ఎన్నికల కోడ్ సందర్భంగా మంగళవారం ఎస్సై కమలాకర్ వాహనాలను తనిఖీ చేశారు. ఇప్పలగడ్డ చెక్‌పోస్టు, పస్రా జడ్పీహెచ్ఎస్ పాఠశాల, మొద్దుల గూడెం శివారు రోడ్లపై వాహనాలను ఆపి సోదాలు చేశారు. డబ్బు, మద్యం సరఫరాను అడ్డుకునేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్న ఎస్సై తెలిపారు.

## అపరిచితుల సమాచారం ఇవ్వాలి

వాజేడు, ఏప్రిల్ 9 : గ్రామాల్లోకి అపరిచిత వ్యక్తులు వస్తే తమకు సమాచారం ఇవ్వాలని వాజేడు ఎస్సై చావాళ్ల వెంకటేశ్వర్‌రావు ప్రజలకు సూచించారు. మండలంలోని పెనుగోలుకాలనీలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రామ్ నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సాయంత్రం జగన్నాథపురం వై జంక్షన్ వద్ద సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో పాటు వివిధ ప్రాంతాలకు వచ్చిపోయే వాహనాలను ఆపి సోదాలు చేశారు. అనుమానితులను ప్రశ్నించారు. సరైన పత్రాలులేని వాహనదారులకు జరిమానాలు విధించారు.

## ఉరేసుకొని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి మృతి


సదయ్య (ఫైల్)

చిట్యాల, ఏప్రిల్ 9 : మండలంలోని వెంకట్రావుపల్లి(సి)గ్రామంలో మనస్తాపంతో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాంపల్లి సదయ్య(55) సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యారు. సోమవారం రాత్రి హై బీపీ పెరగడంతో తనకు కూతురు ఉంటే వచ్చి చూసేదని అంటూ భార్య రాజమణితో చెప్పుకుంటూ బాధపడ్డాడు. అనంతరం ఆయన భార్యను బెడ్‌రూమ్‌లో పడుకోమని చెప్పి తను హాల్‌లో పడుకున్నాడు. తెల్లవారుజామున మంగళవారం భార్య రాజమని చూసేసరి సద య్య ఇంట్లో లేడు. దీంతో ఆమె ఇంటి ఆవరణలో వెతకగా మామిడి చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. ఆమె కేకలు వేయడంతో పక్కనే ఉన్న ఎండీ రఫీ, తన మేనమామ వీరస్వామి వచ్చి చూసేసరికి సదయ్య అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుమారుడు శ్రావణ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

తాడ్వాయి, ఏప్రిల్ 9 : నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. మండలంలోని నార్లాపురాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామంలోని పరిస్థితులను పరిశీలించి గ్రామ పెద్దలు, యువకులతో సమావేశమయ్యారు. గ్రామ ప్రధాన కూడళ్లతో పాటు వీధుల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉంటాయన్నారు.